
www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 25 జనవరి 2024
5
చిత్తూరు





మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని అడ్డుకుంటున్న వైసిపి నాయకులు

పెండింగ్ బిల్లులు చెల్లిస్తారా.. లేదా?

- మంత్రి పెద్దిరెడ్డికి నిరసన సెగ
- కాన్వాయ్‌ని అడ్డుకున్న వైసిపి నేతలు

ప్రజాశక్తి- వీకోట (చిత్తూరు జిల్లా): గడచిన నాలుగు సంవత్సరాలుగా తమకు అందాల్సిన పెండింగ్ నీటి బిల్లులు చెల్లించాలని సొంత పార్టీకి చెందిన వైసిపి నేతలు మంత్రి పెద్దిరెడ్డి కాన్వాయ్‌ని అడ్డుకున్న సంఘటన చిత్తూరు జిల్లా వీకోట మండలంలో చోటు చేసుకుంది. నాలుగు సంవత్సరాలుగా సుమారు రూ.20కోట్ల మేర నీటిబిల్లులు పెండింగులో ఉన్నాయని, పలుమార్లు తమ సమస్య పరిష్కారానికి అమరావతికి వెళ్లి అధినాయకత్వానికి విన్నవించినా ఫలితం లేకపోయిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుప్పం పర్యటనకు బయలుదేరిన విషయం తెలుసు కున్న వైసిపి నేతలు దానమయ్యగారిపల్లి సమీ పంలోని టోల్ ప్లాజా వద్ద మంత్రి కాన్వాయ్‌ను అడ్డుకున్నారు. గత నాలుగు సంవత్సరాల క్రితం వేసవిలో ట్యాంకర్ల ద్వారా తరలించిన నీటి బిల్లుల కోసం, వాటికి సంబంధించిన వివరా లను అందజేసేందుకు బాధితులు ప్రయత్నిం చారు. విషయం తెలుసుకున్న వికోట పోలీసులు 'టోల్‌ప్లాజా వద్దకు చేరుకుని మంత్రి కాన్వాయ్‌ను అడ్డుకుంటారా?' అంటూ సిఐ లింగప్ప ఆధ్వర్యంలో పోలీసులు సిబ్బంది బాధితులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ బాధను మంత్రితో వెళ్లబుచ్చేందుకే ప్రయత్నిం చాం తప్ప కాన్వాయ్‌ను అడ్డుకుని వేరే సమస్య సష్టించేం దుకు కాదన్నారు. గతంలో ప్రభుత్వం తాగునీటి ఎద్దడి నివారించే లక్ష్యంతో ట్యాంకర్లతో గ్రామాలకు నీటిని తరలిస్తే ఇప్పటివరకు బిల్లులు ఇవ్వకుండా ప్రభుత్వం వేధిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అటుగా వచ్చిన మంత్రి పెద్దిరెడ్డి కాన్వాయ్ బాధితులను చూసి కారు దిగిన పెద్దిరెడ్డికి బాధితులు సమస్యను విన్నవించి వినతిపత్రం సమర్పించారు. త్వరగా నీటిబిల్లుల సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చి మళ్లీ కాన్వాయ్‌లో మంత్రి బయలుదేరి కుప్పం పర్యటనకు వెళ్లారు.

25వ తేదీ లోపు ఎన్నికల విధుల కమిటీలు నియమించాలి

- వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్ ఆదేశం



వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్ షన్మోహన్

పజాశక్తి -చిత్తూరు అర్బన్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సజావుగా ఎన్నికలను నిర్వహించేందుకు కమిషన్ ఆదేశాల మేరకు వివిధ కమిటీల నియామకాలను గురువారం సాయంత్రం లోపు పూర్తి చేయాలని, పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న పనులు 27వ తేదీ లోపు పూర్తి చేసి అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ ఎస్ షన్మోహన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ లోని సమావేశపు మందిరం నుంచి కలెక్టర్ ఆర్ఓలు, ఈ ఆర్ఓలు, సహాయ ఎన్నికల అధికారులు, ఎంపీడీఓలతో ఎన్నికల ఏర్పాట్ల కు సంబంధించి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ఎంసిసి కమిటీ, ఫ్లయింగ్ స్క్వాడ్, స్టేట్ సర్వ లైన్స్ కమిటీ, వీడియో సర్వ లైన్స్ కమిటీ, వీడియో వ్యూయింగ్ కమిటీలను గురువారం సాయంత్రం లోపు ఏర్పాటు చేయాలన్నారు. ఎంసిసి కమిటీ, జిల్లాలో మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమలు చేసేందుకు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ప్రతి మండలంలో, మున్సిపల్ ప్రాంతాలలో ఉండేలా ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ స్టేషన్ల వారీగా నియామకాలు చేయాలని ఎంపీడీఓ లు లేదా ఈవోపీఆర్డీలు సభ్యులుగా ఉండాలని మున్సిపల్ ప్రాంతాలలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ లు సభ్యులుగా ఉంటూ పోలీసు లను ఇందులో చేరుస్తారన్నారు. ఈ క్రమంలో చిత్తూరు అర్బన్ లో రెండు, గ్రామీణ ప్రాంతంలో ఒకటి, మున్సిపల్ ప్రాంతాలలో ఒకటి, గ్రామీణ మండలాల్లో ఒకటి చొప్పున ఉండా లన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్, ప్రతి నియోజకవర్గానికి మూడు బృందాలు ఉండాలని ఈ బృందానికి డిప్యూటీ తహశీల్దారు లేదా సీనియర్ ఆర్ఐ, ఏఎస్ఐ, వీడియో గ్రాఫర్, ఆర్మడ్ మ్యాన్ ఉంటారని వారిని ఎంపిక చేయాలన్నారు.

స్టేట్ సర్వలైన్స్ టీం, ఈ టీంలో మండల మెజిస్ట్రేట్, ముగ్గురు పోలీసులు ఉండేలా ఒక నియోజక వర్గానికి మూడు బృందాలుగా ఉండాలని సూచించారు. వీడియో సర్వ లైన్స్ టీం, ఒక నియోజక వర్గానికి మూడు బృందాలు ఉండాలని ఇందులో ఎంపీడీవో కార్యాలయంలోని సూపరింటెండెంట్ , వీడియో గ్రాఫర్ ఉంటారని తెలిపారు. వివిధ పార్టీల వారి ప్రచారం గురించి వీడియో తీయాల్సి ఉంటుందన్నారు. వీరు ఎక్స్పెండేచర్ అబ్జర్వర్ ఆధ్వర్యంలో పనిచేయాలన్నారు. వీడియో వ్యూ వింగ్ టీం, ఈ బృందంలో ఎంపీడీవో, సీనియర్ అసిస్టెంట్ లేదా సీనియర్ జూనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ లు సభ్యులుగా ఉంటారని ఎక్స్పెండేచర్ అబ్జర్వర్ తో కలసి పనిచేయాలన్నారు. ఈ నియామకాలకు సంబంధించి అతి జాగ్రత్తగా నిర్వహణలో ఎలాంటి అలసత్వం వహించని వారిని ఎంపిక చేయాలని, నిర్దేశించిన కమిటీలకు సంబంధించి సంబంధిత అధికారులు వారి ఆరోగ్య పరిస్థితులు ఇబ్బందికరంగా ఉంటే ఆ కింది వారిని రెకమండ్ చేయవచ్చని తెలిపారు. జిల్లాలో 1,762 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, పలు ప్రాంతాలలో చిన్న చిన్న పనులు నిర్వహిస్తున్నారని ఎన్నికల నిబంధనల మేరకు నిర్వహణ పనులు ఈ నెల 27 లోపు పూర్తి చేసి అప్‌లోడ్ చేయాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి రూట్ లను మరోసారి వెరిఫై చేసుకోవాలని ఏదైనా రూట్ లు మార్చి ఉంటే పరిశీలించుకోవాలని మార్చిన విషయం సెక్టోరియల్ అధికారులకు తెలపాలన్నారు. మరోసారి అధికారులు ఈ రూట్ లను పరిశీలించి నివేదికలు ఇవ్వాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు, డిఆర్ఓ ఎన్ రాజశేఖర్, గంగాధర్ నెల్లూరు ఆర్వో భవాని, డీఈవో విజయేంద్రరావు, పిఓఎస్ ఎస్ ఏ వెంకటరమణారెడ్డి, డిఎల్‌డివో రవికుమార్, ఎస్‌డిసి శివయ్య, ఎన్నికల సూపరింటెండెంటు భ్యాల పాల్గొన్నారు.



జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్ షన్మోహన్

జర్నలిస్టుల ఇంటి పట్టాలకు స్థలాలు గుర్తించండి

రెవెన్యూ అధికారులకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జర్నలిస్ట్‌ల ఇంటి పట్టాల మంజూరుకు సంబంధించి సిఐపిఆర్ నుండి ఇప్పటి వరకు జిల్లాకు అందిన జాబితా మేరకు అవసరమైన స్థలాన్ని గుర్తించేందుకు రెవెన్యూ అధికారులతో హౌసింగ్ కమిటీ లోని మీడియా సభ్యులు సమన్వయం చేసుకుని ఈ ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ ఎస్ షన్మోహన్ ఆదేశించారు. జిల్లా సచివాలయం లోని సమావేశపు మందిరంలో కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ రాజశేఖర్‌తో కలసి జర్నలిస్ట్‌ల ఇంటి పట్టాల కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు జిల్లాకు అందిన సిఐపిఆర్ వెరిఫికేషన్ జాబితా మేరకు 311 మంది జర్నలిస్ట్‌లు వున్నారని, రెవెన్యూ వెరిఫికేషన్ ప్రక్రియను త్వరిత గతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గతంలోనే జర్నలిస్ట్‌లు కోరిన ప్రాంతాలలో ఇంటి పట్టాల మంజూరుకు అవసరమైన భూమిని గుర్తించే విషయంలో చిత్తూరు, నగరి, పలమనేరు, కుప్పం, వి కోట, చౌడేపల్లి, పుంగనూరు సంబంధిత రెవెన్యూ అధికారులతో హౌసింగ్ కమిటీ లోని మీడియా సభ్యులు సమన్వయం చేసుకుని ఎఫ్‌ఎంబిలు తయారు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కమిటీ సమావేశానికి జిల్లా ల్యాండ్ అండ్ సర్వే అధికారి గౌష్ బాషా, చిత్తూరు రెవెన్యూ డివిజినల్ అధికారి చిన్నయ్య, సాక్షి స్టాఫ్ రిపోర్టర్ సహదేవ, ఎన్ టివి రిపోర్టర్ అక్రం, టివి 9 రిపోర్టర్ జయరాజ్, డిఐపిఆర్ఓ బి.పద్మజ లతో చిత్తూరు, గుడిపాల తహశీల్దార్లు మురళిమోహన్, బాబు రాజేంద్ర ప్రసాద్, సంబంధిత సిబ్బంది హాజరయ్యారు.



అంతర్ రాష్ట్ర సరిహద్దులో చెక్‌పోస్టు ఏర్పాటు చేస్తున్న పోలీసులు

సరిహద్దు చెక్‌పోస్టు ఏర్పాటు

ప్రజాశక్తి - నగరి: తమిళనాడులో లోక్‌సభ ఎన్నికలు ఏప్రిల్ 16వ తేదీ ఉంటుందంటూ ఎన్నికల సంఘం ప్రతిపాదిత తేదీని ప్రకటించించడం, మన రాష్ట్రంలోనూ ఎన్నికలు సమీపిస్తుండటంతో సరిహద్దు వద్ద ఇరు రాష్ట్రాల పోలీసులు సంయుక్తంగా సరిహద్దు చెక్‌పోస్టును బుధవారం ఏర్పాటు చేశారు. తిరువళ్లూరు జిల్లా, చిత్తూరు జిల్లాల ఎస్పీల ఆదేశాల మేరకు పుత్తూరు డీఎస్పీ రవికుమార్, తిరుత్తణి డీఎస్పీ విఘ్నేష్ తమిళమారన్ ఆంధ్ర, తమిళనాడు రాష్ట్రాల సరిహద్దు పొన్‌పాడి ప్రాంతానికి వెళ్లి చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి సంఘటనలు జరగకుండా సరిహద్దు వద్ద పోలీసు గస్తీ, వాహనాల తనిఖీలు ఉంటుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐలు మార్టిన్ ప్రేమ్‌రాజ్, ఎస్ఐ. రాకీకుమారి, ఎస్ఐలు, పోలీసులు పాల్గొన్నారు.

రామకృష్ణ తీర్థ ముక్కోటికి ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి- తిరుమల: తిరుమలలో నేడు జరగనున్న శ్రీరామకృష్ణ తీర్థ ముక్కోటికి టీటీడీ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఉదయం 7.30 గంటలకు శ్రీవారి ఆలయ అర్చకులు మంగళవాయిద్యాలతో ఆలయ మాడవీధుల గుండా పూలు, పండ్లు, స్వామివారి ప్రసాదాలు తదితర పూజా సామగ్రిని శ్రీరామకృష్ణ తీర్థానికి తీసుకెళతారు. అక్కడున్న శ్రీరామచంద్రమూర్తి, శ్రీకృష్ణుని విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పిస్తారు. భక్తులకు ప్రసాద వితరణ చేస్తారు. కాగా, అధికబరువు, ఆస్తమా, గుండె సంబంధిత సమస్యలు, ఇతర దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు, వద్దుల శ్రేయస్సును దష్టిలో ఉంచుకుని అటవీ మార్గంలో ఈ తీర్థానికి నడిచి వెళ్లడానికి అనుమతి లేదు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలని కోరడమైనది. కాగా, గోగర్భం డ్యామ్ పాయింట్ నుండి పాపవినాశనం వరకు యాత్రికులను తరలించేందుకు ఎపిఎస్ ఆర్టీసీ దాదాపు 35 బస్సులను ఏర్పాటు చేస్తోంది. గురువారం ఉదయం 5 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే యాత్రికులను ఈ తీర్థానికి అనుమతిస్తారు. ఈతీర్థానికి వెళ్లే యాత్రికులకు టీటీడీ అన్నప్రసాద విభాగం ఆధ్వర్యంలో పాలు, కాఫీ, పొంగళి, ఉప్మా, సాంబారన్నం, పెరుగన్నం పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

ప్రజాశక్తి- తిరుమల: తిరుమల శ్రీవారిని భారత మాజీ క్రికెటర్ కె.శ్రీకాంత్ బుధవారం దర్శించుకున్నారు. తెల్లవారు జామున కుటుంబసభ్యులతో కలిసి ఆలయంలోకి వెళ్లిన ఆయన, అర్చన సేవలో పాల్గొని స్వామివారిని దర్శించుకొని, హుండీలో కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు శ్రీకాంత్‌కు తీర్థప్రసాదాలను అందజేశారు.

కాంగ్రెస్ కు విజయావకాశాలు : పల్లం రాజు

కాంగ్రెస్ సీనియర్‌నేత, మాజీ కేంద్రమంత్రి పల్లంరాజు బుధవారం కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. అనంతరం ఆలయం ఎదుట ఆయన మీడియాతో మాట్లాడుతూ వైఎస్ షర్మిల నాయకత్వంలో ఏపీలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం అవుతుందని, త్వరలో విజయావకాశాలు వస్తాయని భావిస్తున్నట్లు పల్లంరాజు అభిప్రాయపడ్డారు. వైఎస్ షర్మిలను ఏపీ పిసిసి ఛీఫ్‌గా అధిష్టానం నియమించడం చాలా సంతోషంగా ఉందని, షర్మిల రాకతో వైఎస్ రాజశేఖర్ రెడ్డి తిరిగొచ్చిన భావన తమకు కలుగుతొందని అన్నారు. షర్మిల్‌లో రాజశేఖర్ రెడ్డి కమిట్మెంట్, కార్యదీక్ష కనిపిస్తోందని అన్నారు. కాంగ్రెస్ అధిష్టానం అన్ని ఆలోచించి తీసుకున్న నిర్ణయానుసారం షర్మిల్‌కు తన పూర్తి మద్దతు ఉంటుందన్నారు.

బాలికల పట్ల లింగ వివక్ష తగదు

ప్రజాశక్తి -నగరి : బాలికల పట్ల లింగ వివక్ష పాటించడం అనైతికం, ధర్మ విరుద్ధం, రాజ్యాంగ విరుద్ధం అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు వేణుగోపాల్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల లోని మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జాతీయ బాలికా దినోత్సవ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నేడు సమాజంలో బాలికలు అనేక రకాల ఇబ్బందులకు గురి అవుతున్నా, వివిధ రంగాల్లో తమ ప్రత్యేకతను చాటుకుంటూ ముందంజలో ఉన్నారన్నారు. రక్షణ, అంతరిక్షం, సాఫ్ట్ వేర్, విద్య, వైద్యం, క్రీడలు మొదల గు అనేక రంగాలలో తమ ప్రతిభను చాటుతున్నారని తెలిపారు. వారిలోని తెలివి తేటలను సమాజానికి ఉపయో గపడేలా చేయూతనిస్తే సమాజం సర్వతో ముఖంగా అభివృద్ధి చెందుతుందన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టరు భాస్కర్ రాజు మాట్లాడుతూ బాలికల పట్ల వివక్ష సమాజానికి మంచిది కాదన్నారు. ప్రభుత్వాలు అనేక రకాలుగా కృషి చేస్తున్నాయని ఉదాహరణకు భేటీ బచావో..భేటీ పడావో, పార్లమెంటు, రాష్ట్ర శాసన సభలు, స్థానిక సంస్థలలో రిజర్వేషన్లు, ఉద్యోగాలలో రిజర్వేషన్లు, బాలికలకు ప్రత్యేక విద్యాలయాలు ఏర్పడ్డాయన్నారు. బాలికలను వివక్షలేని సమాజంలో పెరిగేలా చూడాలని, అది కుటుంబంలోనూ, విద్యాలయాల్లోనూ ప్రారంభం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో వృక్ష శాస్త్ర అధ్యాపకులు అరుణకుమారి, ఆంగ్ల అధ్యాపకులు రేవతి, తెలుగు అధ్యాపకులు డాక్టర్ సి చిన్న పాపమ్మ, డాక్టరు స్వాతి, ఉమా మహేశ్వరి, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ వేణుగోపాల్

నాణ్యమైన విద్య అందరి హక్కు

- వచ్చే ఎన్నికల్లో 'మళ్లీ గెలుస్తాం..: సిఎం
- సాక్ష్యాధారాలతోనే చంద్రబాబు అరెస్ట్



ప్రజాశక్తి- తిరుపతి టౌన్: తిరుపతి నగరంలోని తాజ్ హోటల్లో బుధవారం సాయంత్రం ఇండియా టుడే సమ్మిట్ జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్ రాజ్ దీప్ సర్దేశాయ్ నిర్వహించిన డెబిట్లో జగన్ మాట్లాడారు. పేదరికం తొలగించేందుకు చదువుపై పెట్టుబడి పెట్టడం మినహా మరోమార్గం లేదన్నది తన బలమైన నమ్మకమని అన్నారు. ఇండియా టుడే జర్నలిస్టులు తిరుపతిలోని ప్రభుత్వపాఠశాలను సందర్శించడం గొప్ప విషయమన్నారు. నాణ్యమైన విద్య అందుకోవడం ప్రతి ఒక్కరి హక్కు కావాలని ఆకాంక్షించారు. ఏపీలో విద్యారంగంలో సమూల మార్పులు, విద్యారంగంలో ఆంధ్ర మోడల్ తదితర అంశాల గురించి చర్చించారు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ తామే గెలుస్తామని సీఎం జగన్ ధీమా వ్యక్తం చేశారు. 'ఇచ్చిన హామీలను 98 శాతం అమలు చేశాం. ఏపీలో జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్లకు చోటు లేదు. తమ పోటీ టీడీపీ, జనసేనతోనే ఉంటుంది. సర్వేల ఆధారంగానే ఎమ్మెల్యే టికెట్లు ఇస్తున్నామని, వ్యతిరేకత ఉండటంతో కొందరికి టికెట్లు ఇవ్వడం లేదన్నారు. ప్రజలు మావైపే ఉన్నారని తిరుపతిలో ఇండియా టుడే ఎడ్యుకేషన్ సమ్మిట్లో వ్యాఖ్యానించారు.

సాక్ష్యాధారాలతోనే చంద్రబాబు అరెస్ట్

చంద్రబాబు అవినీతి పాల్పడటంతోనే పోలీసులు అరెస్టు చేశారని సీఎం జగన్ స్పష్టం చేశారు. 'సాక్ష్యాధారాలు పక్కాగా ఉన్నాయి. వీటిని పోలీసులు కోర్టుకు అందించారు. అందుకే ఆయన జైల్లో 52 రోజులు ఉన్నారు. ఎన్నికల ముందు ప్రతిపక్ష నేతను అరెస్టు చేసే సాహసం ఎవరూ చేయరు, కానీ చంద్రబాబు తప్పు చేశారు కాబట్టే మేము అరెస్ట్ చేశామన్నారు. కాంగ్రెస్ పార్టీ మా కుటుంబాన్ని విడదీసే ప్రయత్నం చేస్తుందని ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ తమ కుటుంబ సభ్యుల మధ్య చిచ్చు పెట్టిందని, అందులో భాగంగానే తన సోదరి షర్మిలాకు ఏపీ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలుగా నియమించి, తన పైకి ప్రయోగిస్తున్నారని ఆరోపించారు. గతంలో మా బాబాయ్ వైయస్ వివేకానంద రెడ్డి కాంగ్రెస్ పార్టీ మంత్రి పదవి ఇచ్చి మాపై ప్రయోగించడం జరిగిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ నీచ రాజకీయాలకు పాల్పడుతుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ రాజకీయ లబ్ధి కోసమే రాష్ట్రాన్ని విడదీసిందని తెలిపారు. విభజించి భావించడమే కాంగ్రెస్ నిత్య విధానమని అన్నారు. రాష్ట్రాన్ని విడగొట్టిన కాంగ్రెస్ పార్టీ, ప్రజలు గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలో ఉందని హెచ్చరించారు. తనను సీఎం పదవి నుంచి దింపేయడానికి తన సోదరి షర్మిల పదవి ఇచ్చి ప్రయోగించడం అన్యాయమన్నారు. తనకు ముఖ్యమంత్రి పదవి నుంచి దిగిపోమంటే దిగిపోవడానికి కూడా సంతోషంగా ఉన్నానని చెప్పారు.

ముఖ్యమంత్రికి ఘనస్వాగతం

రేణిగుంట: రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి తిరుపతిలో నిర్వహించే ఇండియా టుడే ఎడ్యుకేషన్ సమ్మిట్ కార్యక్రమంలో పాల్గొనడాని బుధవారం రేణిగుంట విమానాశ్రయం చేరుకున్నారు. సిఎంకు ఘనస్వాగతం లభించింది. స్వాగతం పలికిన వారిలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి జిల్లా ఇంఛార్జి మంత్రి కె.నారాయణ స్వామి, రాష్ట్ర విద్యుత్, అటవీ, భూగర్భ గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి, టూరిజం, సాంస్కృతిక, యువజన క్రీడలశాఖ మంత్రి ఆర్కె రోజా, జడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ వైస్ చైర్మన్ విజయనంద రెడ్డి, తిరుపతి జిల్లా కలెక్టర్ కె.వెంకట రమణారెడ్డి, తిరుపతి, చిత్తూరు ఎస్పీలు పరమేశ్వర రెడ్డి, రిశాంత్‌రెడ్డి, తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత, జాయింట్ కలెక్టర్ శుభం బనల్స్, చిత్తూరు, తిరుపతి, పార్లమెంట్ సభ్యులు ఎన్.రెడ్డెప్ప, యం.గురుమూర్తి, ఎమ్మెల్సీలు సిపాయి సుబ్రహ్మణ్యం, భరత్, పి.చంద్రశేఖర్ రెడ్డి, తిరుపతి ఎమ్మెల్యే, టిటిడి చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, చంద్రగిరి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, చిత్తూరు, సత్యవేడు, కోడూరు, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, బి.మధుసూధన రెడ్డి, సంజీవయ్య, ఆరణి శ్రీనివాసులు, అదిమూలం, కె.శ్రీనివాసులు, మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్ అభినయరెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఉన్నారు.

సిఎంకు సాదర వీడ్కోలు


ఇండియా టు డే ఎడ్యుకేషన్ సమ్మిట్‌లో పాల్గొని బుధవారం రాత్రి 7గంటలకు రేణిగుంట విమానాశ్రయం నుంచి తిరుగు ప్రయాణమైన రాష్ట ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి సాధారణ వీడ్కోలు లభించింది.

శ్రేణుల్లో గ్రూపులు..నేతల్లో గుబులు..

- రోడ్డెక్కుతున్న జీడీ నెల్లూరు నియోజకవర్గ రాజకీయం

ప్రజాశక్తి -వెదురుకుప్పం: గంగాధర నెల్లూరు నియోజకవర్గం రాజకీయం రోజు రోజుకి వేడెక్కుతోంది. ఎప్పుడు పోటీ అభ్యర్థులను మార్పులు చేసి ప్రకటిస్తారో ఉత్కంఠ నెలకొంది. అటు నాయకులలో, ఇటు అభ్యర్థులలో గుబులు మొదలైంది. పార్టీ గ్రూపు తగాదాలు మొదలయ్యాయి. దీంతో జీడీ నెల్లూరు నియోజకవర్గ రాజకీయం రోడ్డెక్కింది.

చిత్తూరు ఎంపీగా ఉన్న రెడ్డప్పను గంగాధర నెల్లూరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి గా ,డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామిని చిత్తూరు లోక్ సభకు మార్చారు. రాష్ట్రస్థాయి నుంచి జాబితా విడుదల అయింది. దీంతో నాయకులు కొంతమంది నారాయణస్వామి 'వద్దు' అని, మరి కొంతమంది 'నారాయణస్వామి కావాలి..' అంటూ..ఆయన పై అభిమానం ఉన్న నాయకులు ఉత్తమ పదవులకు సైతం రాజీనామాలు చేయడానికైనా సిద్ధమేనని సవాల్ విసురుతున్నారు. గంగాధర నెల్లూరు నియోజకవర్గం రిజర్వుడు స్థానం..గత రెండు పర్యాయాలు వైసీపీ తరపున పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచి ప్రస్తుతం ఉన్న డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ నియోజకవర్గంలో వెదురుకుప్పం , కార్వేటినగరం, పాలసముద్రం, శ్రీ రంగరాజపురం , పెనుమూరు, గంగాధర నెల్లూరు మండలాలు ఉన్నాయి. లోక్ సభ స్థానానికి ఒక పర్యాయం రెడ్డప్ప గెలిచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే ప్రస్తుతం ఎమ్మెల్యేగా గెలిచి, డిప్యూటీ సీఎం గా కొనసాగుతున్న కళత్తూరు నారాయణస్వామిని చిత్తూరు ఎంపీగా, ఎంపీగా ఉన్న రెడ్డప్పను గంగాధర నెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా అధిష్టానం ప్రకటించడంతో నియోజకవర్గంలో గందరగోళం నెలకొంది. నారాయణ స్వామికి ఆరు మండలాల్లో ఇటు నాయకులు అటు స్థానికులతో మంచి సంబంధాలు ఉన్నాయి. రెడ్డప్పకి ఏమాత్రం పరిచయాలు గాని సంబంధాలుగాని లేవు.. అలాంటి వ్యక్తిని ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించి నియోజకవర్గాన్ని పంపిస్తే..ఓటర్లు సానుకూలంగా స్పందిస్తారా? లేక తిరస్కరిస్తారా వేచి చూడాలని నియోజకవర్గ నాయకులు చర్చించుకుంటున్నారు. నియోజక వర్గంలో కొంత మంది నాయకులు నారాయణస్వామిపై అలకతో గ్రూపులతో నారాయణస్వామి వద్దంటూ అధిష్టానానికి తెలిపారు. నియోజకవర్గంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఇందులో ప్రముఖంగా పెనుమూరు మండలానికి చెందిన మాజీ ఎంపీ జ్ఞానేందర్ రెడ్డి ఒకరు. వారం క్రితం పెనుమూరు వెదురుకుప్పం మండలాలలోని నాయకులు ప్రెస్ మీట్ ఏర్పాటు చేసి నారాయణ స్వామికి టికెట్టు ఇవ్వకుండా ఉంటే ఎంపీటీసీ, ఎంపీపీ పదవులకు రాజీనామాలు చేస్తామని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో జీడీ నెల్లూరు నియోజకవర్గ రాజకీయం వేడెక్కింది. 'నారాయణస్వామికి ఎమ్మెల్యే టికెట్ ఇస్తే..డిపాజిట్ కూడా రాదని మరి కొందరు తిరుగుబాటు బాట పట్టారు. అయితే పార్టీలో అందరిని కలుపుకొని పోవడంలో నారాయణస్వామి విఫలమవుతున్నారనే విమర్శలు వున్నాయి. నియోజవర్గం అంతటా వ్యతిరేకత ఉందని మరి కొందరు చర్చించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఈ నియోజకవర్గంలో రాజకీయం చర్చనీయాంశమైంది.



శాంతిపురం తహశీల్దారుగా కృష్ణకుమార్


శాంతిపురం తహశీల్దారుగా బాధ్యతలు చేపట్టిన కృష్ణకుమార్

ప్రజాశక్తి -శాంతిపురం: శాంతిపురం మండల నూతన తహశీల్దారుగా కృష్ణ కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కుప్పం ఆర్డీవో ఆఫీసులో అకౌంట్ ఆఫీసర్‌గా పని చేస్తున్న ఆయన ఉద్యోగోన్నతి పై నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు.

నేడు వాహనాలు వేలం: సిఐ

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: అక్రమ మద్యం తరలిస్తూ పట్టుబడిన వాహనాలను వేలం వేస్తున్నామని సీఐ నాగరాజు రావ్ పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అక్రమ వైద్యం తరలిస్తూ పట్టుబడిన నాలుగు మోటర్ సైకిళ్లు, ఒక కారును జిల్లా అధికారుల ఆదేశాల మేరకు వేలం గురువారం 10 గంటలకి పోలీస్ స్టేషన్లో ఎక్సైజ్ శాఖ పోలీస్ శాఖ కలిపి వాహనాలను వేలం వేస్తామని ఆసక్తిగల వారు ముందస్తు సమాచారం అందించి వాహనాల వేలంలో పాటలో పాల్గొనాలని పాట పాడిన తర్వాత పాటదారుడు తగిన రుసుము చెల్లించి వాహనాలను తీసుకెళ్లాలన్నారు.

తిరుపతి(మంగళం): ఈ నెల 30న తిరుపతి, శ్రీకాళహస్తి ఆర్‌టిసి డిపోలలో వాహనాలు వేలంను నిర్వహిస్తున్నామని తిరుపతి జిల్లా ఇన్‌ఛార్జ్ రవాణా శాఖ అధికారి ఆదినారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు ముందుగా తనిఖీ చేసుకోవాలని, వేలం పాటలో పాల్గొనదలచిన వారు ధరావత్తు రూ.5,000 నగదు రూపంలో చెల్లించి పాల్గొనాలని పేర్కొన్నారు. తిరుపతి మంగళం డిపోలో 3మాక్సి క్యాబ్లు, ఒక ఐచర్, ఒక మహీంద్రా, టాటా గూడ్స్ వాహనాలు, శ్రీకాళహస్తి ఆర్‌టిసి డిపోలో 2మహీంద్రా అటోలు, 1 బజాజ్ ఆటో, 1 మహీంద్రా మాక్సి క్యాబ్, 1 మోటార్ క్యాబ్ ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు 30న ఉదయం 11 గంటలకు వేలంలో పాల్గొనాలని సూచించారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: పిల్లలకు మధ్యాహ్న భోజనం రుచికరంగా వడ్డించాలని మండల విద్యాశాఖ అధికారి 2 రమేష్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని దళితవాడలోని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం విద్యార్థులకు రుచికరమైన భోజనం వడ్డించాలని సూచించారు. అనంతరం భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పరంధామయ్య, ఉపాధ్యాయులు చెంగయ్య, మధ్యాహ్న భోజన నిర్వాహకులు పాల్గొన్నారు.

మాణిక్య ఠాగూర్‌ని కలిసిన లాయర్ మునికృష్ణ

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: కాంగ్రెస్ తరపున గంగాధర నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా టికెట్ ఆశిస్తూ విజయవాడలో ఏపీ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మాణిక్య ఠాగూర్ ని కలిసి బుధవారం గంగాధర నెల్లూరు నియోజకవర్గానికి చెందిన ప్రముఖ లాయర్ మణికృష్ణ బయోడేటా అందించారు. అనంతరం మాణిక్య ఠాగూర్‌కు లాయర్ మణికృష్ణ పుష్పగుచ్ఛం అందించి శాలువాతో ఘనంగా సన్మానం చేశారు.

వైసిపిలోకి యువకుల చేరిక

ప్రజాశక్తి - రామకుప్పం:మండల కేంద్రమైన రామకుప్పానికి చెందిన పలువురు యువకులు బుధవారం చెల్దిగానిపల్లి వద్ద మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమక్షంలో వైసిపిలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకు ఆకర్షితులై వైసిపిలో చేరినట్లు తెలిపారు. ఎమ్మెల్సీ భరత్‌ను కుప్పంలో గెలిపించడమే లక్ష్యంగా పనిచేయనున్నట్లు వారు పేర్కొన్నారు. వైసిపిలో చేరిన వారిలో మహేష్, నరేంద్ర, మునీరజ్, ముత్తు, భరత్, సుమంత్, అరుణ్, రామోజీ, ఇంతియాజ్, గణేష్, గోపి, శ్రీకాంత్, రాహుల్, నదీమ్, రవి,సదమ్మ్, షంశిర్, పురుషోత్తం, సూర్య, తదితరులు ఉన్నారు.

రేపు పెట్రోల్ బంక్ ప్రారంభం

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పుత్తూరు కేంద్రంలో ఫైర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్‌ను ప్రారంభిస్తున్నట్లు పుత్తూరు ఫైర్ ఆఫీసర్ నేతాజీ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్యులు ఈ ప్రారంభోత్సవంలో పాల్గొంటారన్నారు.

వధూవరులకు పులివర్తి ఆశీర్వాదం

ప్రజాశక్తి-రామచంద్రాపురం(చంద్రగిరి): చంద్రగిరి పట్టణం కొత్తపేటకు చెందిన షబ్బీర్ ఇంట్లో బుధవారం శుభకార్యానికి చంద్రగిరి నియోజక వర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ పులివర్తి నాని హాజరైయ్యారు. అనంతరం వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో కుమార్‌రాజా రెడ్డి, పల్లినేని సుబ్ర హ్మణ్యం నాయుడు, షేక్‌గౌస్ బాషా, ఈశ్వర, శివకోటేశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీల్లో నారాయణవనం జట్టు విజేత

ప్రజాశక్తి-నారాయణవనం: నారాయణవనం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదా నంలో బుధవారం జరిగిన మండల స్థాయి వాలీ బాల్ పోటీల్లో నారాయణవనం వాలీబాల్ జట్టు విజేతగా నిలిచింది. కార్యక్రమంలో ఎంఈఓ ప్రభాకర్‌రాజు, ఎంఈవో గోవిందరాజులు, జెడ్పీ గర్ల్స్ హైస్కూల్ హెచ్‌ఎం శశికళ, బాయ్స్ హైస్కూల్ హెచ్‌ఎం సులోచన పాల్గొన్నారు.

రేపు 'విశ్వం'లో

సైనిక్ మోడల్ ప్రవేశ నమూనా పరీక్ష

ప్రజాశక్తి-క్యాంపస్: విశ్వం పాఠశాలలో శుక్రవారం సైనిక్ మోడల్ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు పాఠశాల అధినేత డాక్టర్ విశ్వనాథరెడ్డి తెలిపారు. 6, 9వ తరగతి ప్రవేశానికి జాతీయ స్థాయికి అనుగుణంగా నమూనా పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. వివరాలకు 86888 88802/03, 9399976999 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

సిఐటియులోకి వీవోఏలు

ప్రజాశక్తి-నాయుడుపేట

నాయుడుపేట వీవోఏలు బుధవారం సీఐటీయూలో చేరారు. సుందరరామిరెడ్డి భవన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు శివకవి ముకుందా, చాపల వెంకటేశ్వర్లు గోపాలయ్య కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు వివోఏలు సిఐటియులో చేరడం మంచి పరిణామం అన్నారు. హక్కులను కలిసి సాధించుకుందాం అని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆశ జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బర్డ్ ఫొటోగ్రఫీ ప్రదర్శన

ప్రజాశక్తి-క్యాంపస్: ఎస్వీయూలోని జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన బర్డ్ ఫోటో గ్రఫీ ఎగ్జిబిషన్ విజయవంతంగా ముగిసినట్లు ఫొటోగ్రాఫర్ కిరణ్ కుమార్ అన్నారు. విభిన్న ఏవియన్ జాతులను ప్రదర్శించారు.

అంజమ్మ మృతికి నివాళి

ప్రజాశక్తి-పాకాల: మండలంలోని సామిరెడ్డిపల్లికి చెందిన మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ జనార్ధన్‌రెడ్డి తల్లి అంజమ్మ మృతి చెందారు. చంద్రగిరి టీడీపీ వైసీపీ, టీడీపీ ఇన్‌ఛార్జులు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, పులివర్తి నాని వేర్వేరు సమయాల్లో అక్కడకు చేరుకొని ఆమె మృతదేహానికి నివాళులు అర్పించారు.

'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర' విజయవంతంపై ప్రశంసలు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర'ను జిల్లాలో ఇప్పటివరకు 646 గ్రామపంచాయతీల్లో జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారుల సమన్వయంతో జిల్లాలో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించామని కలెక్టర్ ఎస్. షన్మోహన్ ప్రశంసించారు. జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో "వికసిత్ భారత్ సంకల్ప యాత్ర' నిర్వహణకు సంబంధించి సంబంధిత శాఖల జిల్లా స్థాయి అధికారులతో కలెక్టర్ అధ్యక్షతన ఈ ప్రత్యేక అధికారి, పరిశీలకులు సచింద్రకుమార్ పట్నాయక్‌తో కలిసి జిల్లా స్థాయి సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2023 నవంబర్ 25న ఈ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రం నుంచి ప్రారంభించారని ఇప్పటి వరకు 646 గ్రామ పంచాయతీలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించి సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారన్నారు. ఇంకా మిగిలిన 51 గ్రామ పంచాయతీలో ఈ నెల 30వ తేదీ లోపు సంకల్ప యాత్రను పూర్తి చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ సంకల్ప యాత్రను జిల్లా యంత్రాంగంతో పాటు జెడ్పి సిఈఓ సంబంధిత జిల్లా శాఖల జిల్లా అధికారులు మండల స్థాయి అధికారులతో సమన్వయం చేసుకొని విజయవంతం చేశారన్నారు. జిల్లాలో ఆయుష్మాన్ భారత్ కు సంబంధించి 4,75,170 కార్డులకు ఈకేవైసి పూర్తి చేశారని పీఎం గరీబ్ కళ్యాణ్ అన్న యోజన కింద 17,16,898 యూనిట్స్ పూర్తి చేశారని అంత్యోదయ యోజన కింద నేషనల్ రూరల్ లైవ్లీ హుడ్ మిషన్ ద్వారా 878 మందికి ఉపాధి కల్పించారని, పీఎం ఆవాస్ యోజన కింద జిల్లాకు మంజూరైన 73,584 గృహాలకు గాను 45,256 గృహాలు పూర్తి చేశారని తెలిపారు. పీఎం ఉజ్వల యోజన కింద 9,847 కనెక్షన్స్ ఇచ్చారని, పీఎం కిసాన్ సమాన్ కింద 2,29,850 మంది రైతులు రూ.537.92 కోట్లు లబ్ధి చేకూరిందన్నారు. పీఎం పోషణ అభియాన్ లో భాగంగా 2,420 అంగన్వాడీ కేంద్రాల ద్వారా 7 నెలల నుండి మూడు సంవత్సరాల వయసు గల 57,184 మంది పిల్లలకు, మూడు సంవత్సరాల నుండి ఆరు సంవత్సరాల వయసుగల 28,192 మంది పిల్లలకు, 1139 మంది గర్భిణులకు, 10,964 మంది బాలింతలకు లబ్ధి చేకూరుతోందని కలెక్టర్ వివరించారు. ప్రత్యేక అధికారి, పరిశీలకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం వికసిత భారత సంకల్ప యాత్రను చేపట్టారని ఈ సంకల్ప యాత్ర ను జిల్లాలో సమర్థవంతంగా నిర్వహించినందుకు కలెక్టర్ ను, జిల్లా యంత్రాంగాన్ని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సమీక్ష సమావేశం లో



వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న అధికారులు

జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు, డిఆర్ఓ ఎన్.రాజశేఖర్,ఈ కార్యక్రమ నోడల్ అధికారి ప్రభాకర్ రెడ్డి,డి ఆర్ డి ఏ,హౌసింగ్, డ్వామా పి డి లు తులసి, పద్మనాభం, గంగా భవానీ,సోషల్ వెల్ఫేర్ డిడి రాజ్యలక్ష్మీ, డి పి ఓ లక్ష్మీ, డిఎస్ఓ శంకరన్, డిఎల్‌డిఓ రవి కుమార్, జిఎం డిఐసి చంద్రశేఖర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీ కృష్ణ, డిఈఓ విజయేంద్ర రావ్, డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టరు ప్రభావతి దేవి, ఆరోగ్య శ్రీ కో ఆర్డినేటర్ డాక్టరు సుదర్శన్, ఐసిడిఎస్ పీడీ నాగ శైలజా, డిపిఆర్‌సి కోఆర్డినేటర్ షణ్ముగం, సంబంధిత శాఖల ఇతర అధికారులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

అత్యాచారం కేసులో నిందితుడు ఖైదు


నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

ప్రజాశక్తి -నగరి : మున్సిపల్ పరిధి, చింతల పట్టెడలో మంగళవారం రాత్రి జి అరుణ్ కుమార్ (32) అనే యువకుడు ఓ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వెంటనే నిందితుడి కోసం గాలింపు చేపట్టిన ఇన్‌ఛార్జి సీఐ శ్రీనివాసంతి బుధవారం నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టుకు తరలించారు. జూనియర్ సివిల్ జడ్జి విష్ణువర్మ నిందితుడికి 15రోజుల రిమాండ్ విధించగా కోర్టు కానిస్టేబుల్ నవీన్ నిందితుడిని చిత్తూరు జిల్లా జైలుకు తరలించారు.

సినీ రచయిత తల్లికి మంత్రుల నివాళి


మునిలక్ష్మమ్మకు నివాళులు అర్పిస్తున్న మంత్రులు రోజా, ప్రముఖులు

ప్రజాశక్తి - కార్వేటినగరం: ప్రముఖ సినీ రచయిత ఆకుల శివ తల్లి ఆకుల మునిలక్ష్మమ్మ (92) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వారి స్వగ్రామం సీడీ కండ్రిగలో బుధవారం జరుగుతున్న శుభ స్వీకరణ కార్యక్రమానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి, రాష్ట్ర పర్యాటక శాఖ, క్రీడాశాఖ మంత్రి ఆర్కే రోజా హాజరై ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాలు అర్పించారు. సినీ రచయిత ఆకుల శివ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ సినీ డైరెక్టర్ వీవీ వినాయక్ హాజరై మునిలక్ష్మమ్మకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ ఆకుల శివతండ్రి ఆకుల సుబ్రమణ్యంశెట్టి గతంలో 30 సంవ త్స రాలుగా సర్పంచ్‌గా ఎనలేని సేవలు అందించారని గుర్తు చేశారు. వారి కుటుంబ సభ్యులు నేటికి ప్రజా ప్రతినిధులుగా పంచాయతీ అభివృద్ధికి కృషి చేయడం అభినంద నీయమని కొనియాడారు. ఆకుల మునిలక్ష్మమ్మ కు వైసిపి నాయకులు కృపా లక్ష్మి, ఎంపీపీ లతబాలాజీ, మండల కన్వీనర్ శేఖర్‌రాజు, మాజీ కన్వీనర్ ధనంజయవర్మ, జేసీఎస్ కన్వీనర్ పురంధర్, సింగిల్ విండో అధ్యక్షుడు లోకనాధరెడ్డి, డీసీసీబీ అధ్యక్షుడు పోటుగారి భాస్కర్, గుణవతి నివాళులర్పించారు.


క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న స్పెషల్ ఆఫీసర్ శ్రీదేవి

విద్యతోపాటు క్రీడల్లో రాణించాలి

ప్రజాశక్తి - గంగాధరనెల్లూరు

యువతీ యువకులు విద్యతో పాటు క్రీడారంగంలో సైతం రాణించాలని నియోజకవర్గం స్పెషలాఫీసర్ శ్రీదేవి కోరారు. బుధవారం 'ఆడుదాం ఆంధ్ర' లో భాగంగా నియోజక వర్గ స్థాయిలో గంగాధర నెల్లూరు హైస్కూ ల్లో ఆరు మండలాలకు చెందిన యువతి, యువ కులకు క్రీడాపోటీలను అధికారులు , నేతలతో కలిసి స్పెషల్ ఆఫీసర్ శ్రీదేవి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వాలీబాల్, కోకో, కబడ్డీ జట్టులు పోటీ పడ్డాయి. ఈకార్యక్రమంలో ఎంపీపీ అనిత, ఇన్‌ఛార్జి ఎంపీడీవో సుధాకర్, మండల వైస్ ఎంపీపీ హరిబాబు సర్పంచ్ సుబ్రమణ్యం, హైస్కూల్ పీడీ పాండ్యన్, పలువురు పీడీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

టీడీపీ నాయకుల విస్తృత ప్రచారం

ప్రజాశక్తి -చిత్తూరుఅర్బన్: 'రాకదలిరా...' పిలుపు మేరకు బుధవారం చిత్తూరు నియోజవర్గ పరిధిలోని 8వ డివిజన్ కూరగాయల మార్కెట్ నుంచి టిడిపి సీనియర్ నాయకులు గురజాల జగన్మోహన్ నాయుడు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గురునగర కాలనీ, వెంగల్ రావు కాలనీలోని ప్రతి ఇంటికీ వెళ్లి వచ్చే ఎన్నికల్లో టిడిపి విజయం సాధిస్తే అమలు చేయనున్న సంక్షేమ పథకాలను వివరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపిని గెలిపించాలని ఆరాచక జగన్ ప్రభుత్వాన్ని ఇంటికి పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలికల ఆరోగ్యంపై అవగాహన



గంగవరంలో పరిశుభ్రతపై బాలికలకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

ప్రజాశక్తి - గంగవరం

మండలంలోని మదర్ థెరిసా విద్యాసంస్థల ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా పలమనేరు పాలిటెక్నికల్ బాలికల కళాశాలలో బాలికల ఆరోగ్యం, పరిశుభ్రతపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించినట్లు ఎన్ఎస్ఎస్ అధికారి కిషోర్ తెలిపారు. ఈ కార్యక్రమం కళాశాల ఇంజనీరింగ్ విద్యార్థుల విభాగం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారులు, వాలంటరీలు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

సోమల: పాఠశాల విద్యార్థులు ప్రతిరోజూ భోజనం తినే ముందు చేతులు పరిశుభ్రంగా కడుక్కొని ఆహారం తినాలని సోమల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిహెచ్ఓ అమరనాథ్ తెలిపారు. సోమల పంచాయతీ చిన్న సోమల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు చేతుల పరిశుభ్రత వ్యక్తిగత పరిశుభ్రత పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత కోసం ప్రతి రోజు స్నానం చేయాలని ఉతికిన దుస్తులు వేసుకోవాలని జలుబు, దగ్గు, జ్వరం లాంటి వ్యాధులకు వచ్చినప్పుడు వైద్యుల సలహాల మేరకు మాత్రలు మందులు తీసుకోవాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - రామకుప్పం

రామకుప్పం మండల పరిధిలో ఇద్దరు టీడీపీ కార్యకర్తలు అనారోగ్యంతో మృతి చెందారు. బల్ల పంచాయతీ , కృష్ణాపురం దిన్నె గ్రామం ఉండు బత్తెప్ప, ముద్దనపల్లి పంచాయతీ, ఆవుల కుప్పంకు చెందిన వేంకటేశప్ప అనే ఇద్దరు సీనియర్ టిడిపి కార్యకర్తలు మృతి చెందారు. స్థానిక నాయకులు మృత దేహాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. టిడిపి తరపున మృతుల కుటుంబాలకు పదివేలు రూపాయల చొప్పున ఆర్థిక సాయం అందించారు. మృతులకు నివాళులు అర్పించిన వారిలో రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు మునుస్వామి, మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి, కార్యదర్శి నరసింహులు ,నాగభూషణం, జయ శంకర్, పత్రా, సత్తి, మాజీ ఎంపిటిసి ఈశ్వరమ్మ , ఎర్రప్ప శంకర్, మురళి, పెరుమాళ్, బీసీ సెల్ హరి ప్రసాద్, కే హరి ఉన్నారు.


జిల్లా స్థాయికి ఎంపికైన బంగారుపాళ్యం మండల జట్టు

జిల్లా పోటీకి వాలీబాల్, కబడ్డీ జట్టు ఎంపిక

ప్రజాశక్తి -బంగారుపాలెం: 'ఆడుదాం ఆంధ్ర'లో గ్రామస్థాయి నుండి నియోజకవర్గ స్థాయిలో జరిగిన పోటీలలో బంగారు పాళ్యం కబడ్డీ , వాలీబాల్ జట్టు విజయం సాధించి జిల్లా జట్టుకు ఎంపికయ్యాయని ఎంపీడీవో గౌరీ పేర్కొన్నారు. యువతల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఆడుదాం ఆంధ్రను ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఈవోపీఆర్డీ దుర్గాప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం: ఆదిమూలం

ప్రజాశక్తి-నారాయణవనం: వచ్చే ఎన్నికల్లో వైసీపీ గెలుపే లక్ష్యంగా పనిచేద్దామని శ్రేణులకు సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపునిచ్చారు. బుధవారం నారాయణవనంలోని వైఎస్సార్ సర్కిల్ వద్ద పార్టీ నాయకులతో కలిసి ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసి మాట్లాడారు. జగనన్న కోసం తోడేళ్ల గుంపుతో పోరాడేందుకు అందరూ సిద్ధం కావాలన్నారు. జగనన్నతో కలిసి నడిచేందుకు సిద్ధం కావాలని కోరారు.

'శ్మశాన స్థలానికి సర్వే చేపట్టాలి'

ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: సర్వే చేసి శ్మశాన వాటిక స్థలాన్ని చూపాలని పుత్తూరు రూరల్ మండలం తడుకు పంచాయతీ రంగంట యానాది కాలనీ వాసులు అధికారులను కోరారు. బుధవారం దళిత గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నందయ్య ఆధ్వర్యంలో వినతి పత్రం అంద జేశారు. ఆయన మాట్లాడుతూ యానాదులు గత 70 ఏళ్లుగా తడుకు లెక్క దాకలలో యానాది కాలానికి ఉత్తరం భాగంలో శ్మశానం అనుభవంలో ఉందన్నారు. ఈ విషయమై తహశీల్దార్ స్పందించి తక్షణమే సర్వే చేయాలని కోరారు. సుశీల, గిరి, బాలయ్య, కన్నెమ్మ, నాగరాజు, అశోక్, నాగమ్మ కోరుతున్నారు.


విద్యార్థులపై ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలి: ఎంఈఓ


రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈవో శ్రీరాములు

ప్రజాశక్తి -సోమల

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల విద్యాసామర్థ్యాలపై ఉపాధ్యాయులు పూర్తి శ్రద్ధ వహించి ప్రత్యేక బోధన చేసి వారికి పాఠ్యాంశాలు అర్థమయ్యే విధంగా బోధించాలని మండల విద్యాశాఖ అధికారి శ్రీరాములు కోరారు. బుధవారం సోమల ప్రాథమిక పాఠశాలలో రికార్డు లను హాజరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్నం భోజనాన్ని ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం విద్యార్థులకు అందజేయాలని పాఠశాల పరిశుభ్రత, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. నగరంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్లయ్య, ఉపాధ్యాయులు సురేష్, రామ్మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

'టిడిపికి ఆయువుపట్టు బీసిలే'


ఐరాలలో టిడిపి నాయకుడిని సన్మానిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్

టిడిపికి ఆయువుపట్టు బీసీలేనని మాజి ఎంఎల్‌సి దొరబాబు అన్నారు. టిడిపి పాలనలో బీసిల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేయడంతో పాటు రాజకీయ ఎదుగుదలను ప్రోత్సహించిన్నట్లు చెప్పారు. బుధవారం స్థానిక టిడిపి జిల్లా పార్టీ కార్యాలయంలో జయహా బిసి కార్యక్రమాన్ని టిడిపి బిసి రాష్ట్ర కన్వీనర్ రాజన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా టిసి రాజన్ మాట్లాడుతూ టిడిపి పాలనలోనే బీసిలకు గుర్తింపు వచ్చిందన్నారు. జగన్ ప్రభుత్వం బిసి, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్లను నిర్వీయం చేసిందన్నారు. తిరిగి బీసీలు ఆర్థిక, రాజకీయ స్వేచ్ఛ కావాలంటే టిడిపి అధికారంలోకి రావాలన్నారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రభుత్వం ఉల్లంఘిం స్తోందన్నారు. అక్రమ మార్గాల్లో డబ్బులు సంపాదించిన అధికార పార్టీ నేతలు ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నట్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో జగన్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పేందుకు ఓటర్లు సిద్ధంగా ఉన్నారని టిడిపి విజయం ఖాయమన్నారు. ఈ సమావేశంలో టిడిపి లీగల్ సెల్ నాయకులు త్రిమూర్తి, బీసి సెల్ నాయకులు వెంకటేష్‌లతో పాటు పలువురు బీసి సెల్ నాయకులు వన్నియర్ కుల క్షత్రియ సంఘం నేతలు పెద్ద సంఖ్యలో జనం పాల్గొన్నారు.

ఐరాల: పూతలపట్టు నియోజకవర్గం, ఐరాల మండలం, నాంపల్లి గ్రామంలో టిడిపి, జనసేన సంయుక్తంగా జయహో బీసి సభను ఘనంగా నిర్వహించారు. పూతలపట్టు నియోజకవర్గం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కలికిరి మురళీమోహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సభాస్థలికి చేరుకున్న మురళీమోహన్ కు భారీ గజమాల, కిరీటంతో బీసి సోదరులు సత్కరించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు నడుమ మురళీమోహన్ కు స్వాగతం పలికారు. 'జయహో బీసీ'కి ఐరాల మండలం నుంచే కాకుండా నియోజకవర్గం నుంచి విశేష సంఖ్యలో టీడీపీ, జనసేన కార్యకర్తలు, ప్రజలు, అభిమానులు పాల్గొన్నారు. డాక్టర్ కలికిరి మురళిమోహన్ ఆధ్వర్యంలో ఐరాల మండలం 35 మల్లంపల్లి గ్రామానికి చెందిన యాదవ సామాజిక వర్గానికి చెందిన 15 కుటుంబాలు వైసీపి నుండి టిడిపిలో చేరారు. టీడీపీ పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కలికిరి మురళీమోహన్ మాట్లాడుతూ జగన్ బీసీలకు తీరని అన్యాయం చేసి, ఐదేళ్ల కాలంలో ఒక్క బీసీ కూడా ప్రోత్సాహం ఇవ్వలేదన్నారు. బీసీలందరికి న్యాయం చేసిన ఘనత టిడిపి ఒక్కటే దక్కిందన్నారు. జ్యోతిరావు పూలే ఆశయాలతో నడుస్తున్న వ్యక్తి పవన్ కళ్యాణ్, ఎన్టీఆర్ ఆశయాలతో నడుస్తున్న చంద్రబాబు నాయుడు కలయికలో ఏపికి ఒక సువర్ణ అవకాశం రాబోతుందన్నారు. బీసిలకు అధిక ప్రాధాన్యత ఇచ్చే టిడిపిని గెలిపించుకోవాల్సి బాధ్యత అందరిపై ఉందని మురళిమోహన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పూతలపట్టు నియోజకవర్గం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కలికిరి మురళీమోహన్, పరిశీలకులు శ్రీధర్, మండల అధ్యక్షుడు గిరినాయుడు, స్థానిక ముఖ్య, టిడిపి జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మండల నలుమూల నుండి 'జయహో బీసీ' కార్యక్రమానికి విచ్చేసిన బీసీ కుటుంబ సభ్యులకు, టిడిపి, జనసేన నాయకులకు, కార్యకర్తలకు కుటుంబ సభ్యులకు ఆయన తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

బోరు మోటర్ వైర్లు చోరీ


- ఆందోళనలో రైతులు
- స్పందించని అధికారులు

ప్రజాశక్తి -బంగారుపాళ్యం

బోరు మోటర్ల వైరు చోరీకి గురైన సంఘటన మంగళవారం రాత్రి మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని రోళ్ళవారిపల్లి గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం రెడ్డి సదాశివరెడ్డి బాలాజీ రాణమ్మ వినోద్ బోరు మోటారు కి సంబంధించిన వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు కత్తిరించి అపహరించారు. దాదాపు గ్రామంలో 200 మీటర్లు బోరు మోటార్ వైర్లను కత్తిరించారని రైతులను కాపాడాల్సిన వ్యక్తులు రైతులను నడ్డి విరిచే విధంగా చేస్తున్నారని రైతులు వాపోయారు. అసలే పంట చేతికి వచ్చే సమయంలో కోతులు, పందులు, ఏనుగుల బెడదతో అవస్థలు పడుతుంటే బోరు మోటార్లను వైర్లను దొంగలించే ముఠా అధికమైపోతోందని దొంగలించిన వ్యక్తులను గుర్తించి రైతులకు తగు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు. దీనివల్ల వ్యవసాయం చేయాలా? వద్దా అనే ఆలోచనలో పడ్డామని రైతులు వాపోతున్నారు. వెంటనే అధికారులు స్పందించి న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

జగన్ పాలనపై మొదలైన తిరుగుబాటు

మాజీ మంత్రి అమరనాథ్ రెడ్డి


గ్రామాల్లో పర్యటిస్తున్న మాజీ మంత్రి అమరనాథరెడ్డి

ప్రజాశక్తి -వి కోట : అధికార వైసిపిలో ముఖ్యమంత్రి పాలనపై ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు తిరుగుబాటు ప్రారంభించారని మాజీ మంత్రి అమరనాథ్ రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని తోటకనుమ పంచాయతీ పరిధిలో ని గ్రామాల్లో బుధవారం టిడిపి ఆధ్వర్యంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ -భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో పెద్ద ఎత్తున వారికి ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో ఎన్నడూ లేని విధంగా తెలుగుదేశం పార్టీకి అపూర్వ ఆదరణ లభిస్తోందని రాబోవు ఎన్నికల్లో టిడిపి విజయానికి ఇది దోహద పడుతుందన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా ఇళ్ల నుండి బయటకు వచ్చి ప్రభుత్వానికి వ్యతి రేకంగా అభివృద్ధి సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు కావటం లేదని తెలుపు తున్నారన్నారు. పి.కొత్తూరులో ఆయన విలేక రు లతో మాట్లాడుతూ సాక్షాత్తు రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కాన్వాయ్ ని వైసిపి నాయకులు అడ్డగించడం ప్రభుత్వ అసమర్థ పనితీరుకు నిదర్శనమన్నారు. జగన్మోహన్ రెడ్డి పాలనపై విసుగుచెంది పార్టీ కార్యకర్తలే తిరుగు బాటు చేస్తున్నారన్నారు. నియోజకవర్గ పరిధిలో సుమారు 40 కోట్ల రూపాయల మేర పెండింగ్ నీటి బిల్లులు ఉండడంతో పరిపాలన ఏ విధంగా సాగుతుందో తెలుస్తోందన్నారు. గ్రామ పంచాయతీ సర్పంచుల నిధులను దారి మళ్లించి గ్రామ పంచాయతీలో దినసరి కూలీలకు డబ్బులు చెల్లించలేని ఘనత వైసిపి ప్రభుత్వా నికి దక్కిందన్నారు. స్థానిక నాయకులు అప్పులు చేసి చేసిన పనులకు బిల్లులు చెల్లించక పోవ డంతో వారు అప్పుల ఊబిలో కూరుకు పోయా రని ఆవేదన వ్యక్తం చేశారు. సాక్షాత్తు మంత్రి నియోజక వర్గంలో దళిత కౌన్సిలర్ వద్ద డబ్బులు తీసుకొని పని చేయకపోవడం సిగ్గుచేటని ఇటు వంటి వారిని అదుపు చేయడంలో ముఖ్యమంత్రి విఫలమయ్యారన్నారు. టిడిపికి, చంద్రబాబు నాయుడుకు వైయస్ షర్మిల స్టార్ క్యాంపైనర్ ఎలా అవుతారని ఆయన ప్రశ్నించారు. పరదాల చాటు ముఖ్యమంత్రిని ప్రజాప్రతినిధులు కలవలేని దుస్థితి ఆంధ్రప్రదేశ్‌లో నెలకొందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, ఉపాధి, జాబ్ క్యాలెండర్ లేదని పెట్టుబడులు రావటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. చంద్రబాబు నాయుడు లాంటి ముందు చూపుతున్న వ్యక్తి రాష్ట్రానికి మరల ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీరి వెంట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రామచంద్ర నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు రంగనాథ్, రాంబాబు, బైరెడ్డిపల్లి కిషోర్ గౌడ్, గుణశేఖర్, చంద్రశేఖర్ రెడ్డి, రూహుళ్ల, ధీరజ్, శబరిష్, మురుగేష్ పాల్గొన్నారు.